క్లుప్తంగా

రెండు పీహెచ్‌సీలలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

ఓజిలి: మండలంలోని అత్తివరం, వజ్జావారి పాళెం పీహెచ్‌లలో స్విమ్స్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు బీపీ, షుగర్ వ్యాధులతోపాటు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 40 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ పరీక్షలను తప్పకుండా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ, మోహన్‌రంగా, హరిత, సుభాషిణి, మాధవ్, డిప్యూటీ హెచ్ఈఓ రాజగోపాల్, ఎంపీహెచ్ఈఓ రూతు వినయ, ఏఎన్ఎం కుసుమకుమారి, సిబ్బంది ప్రసాద్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



మంగళసూత్రం చూపుతున్న ఆలయ అర్చకులు

చిల్లకూరు: మండలంలో కలవకొండలోని ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం భక్తజన సందడి నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. అక్షింతల కోసం యువతీ యువకులు పోటీ పడ్డారు. ఈఓ రవికృష్ణ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'సంక్షేమ' ఫలాల కోసం ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

చిల్లకూరు: ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులందరికీ వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ గురువారం గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) నాయకులు ధర్నా చేశారు. వర్కర్స్, సీఐటీయూ నాయకులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాలు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ విభాగం కార్మికుల పిల్లలకు వర్తింపచేయడం లేదని నిరసించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు దారా కోటేశ్వరరావు, వెంకటరమణయ్య, జోగి శివకుమార్, బీవీ రమణయ్య, అడపాల ప్రసాద్, పామంజి మణి, పుట్టా శంకరయ్య, చంద్రమోహన్, శ్రీనివాసులు, పెంచలమ్మ, క్రిష్ణమ్మ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

సూళ్లూరుపేట: పట్టణంలోని కాళంగినదికి పక్కనే డంపింగ్ యార్డును జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ గురువారం పరిశీలించారు. ఈ యార్డులో సమారు 38,168 మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్ వుంది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ టెండర్ ద్వారా జిగ్మా కంపెనీ ఈ చెత్తను బయో మైనింగ్ పద్ధతిలో నిర్మూలిస్తోంది. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, మండల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి



వినియోగదారులతో మాట్లాడుతున్న అధికారులు

వెంకటగిరి రూరల్ : ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తూ నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేయనున్నట్లు ఆ సంస్థ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయ మూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని సబ్ డివిజన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో పాల్గొన్నారు. ఆర్థిక సభ్యులు మధుసూదన్ మాట్లాడుతూ.. వినియోగదారులు దీర్ఘకాలిక ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి మాట్లాడుతూ.. వినియోగదారులు, రైతులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించాలని సూచించారు. నాయుడుపేట ఈఈ వై శ్రీనివాసులు, వెంకటగిరి డీఈఈ మునిరవిచంద్ర, ఏఈ అశోక్‌రెడ్డి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'తొలిఅడుగు'

ఓజిలి: గ్రామాల్లో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కర్రబల్లవోలు, సగుటూరులో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీను సీఎం చంద్రబాబు నెరవేరుస్తారన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి



ఓజిలి: మానమాలలో..



గూడూరులో తులసి పూజ నిర్వహిస్తున్న మహిళలు



నాయుడుపేటలో సామూహిక కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు

సైదాపురం: గురు పౌర్ణమి పురస్కరించుకుని గురువారం భక్తుల నామస్మరణతో బాబా ఆలయాలు మార్మోగాయి. మండల కేంద్రంతోపాటు కలిచేడు, చాగణంలోని సాయిబాబా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, పూల అలంకరణ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఓజిలి మండలంలో..

ఓజిలి: మానమాలోని బాబా మందిరంలో పండితులు నార్నీపాటి హరికృష్ణశర్మ సాయివ్రత రుద్రాభిషేకం, పాలాభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. తెనాలిబ్యాండు వాయిద్యాల నడుమ సాయినాథుని గ్రామోత్సవం నిర్వహించారు.

బాబాకు వెండి కిరీటం సమర్పణ

చిల్లకూరు: గూడూరు పటేల్ వీధిలోని విజయదుర్గ అమ్మవారి ఉప పీఠంలో అమ్మవారు శాకాంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. అలాగే షిర్డి సాయిబాబాకు పలు అభిషేకాలు చేశారు. బాబాకు వెండి కిరీటాన్ని శాంతికుమార్‌రెడ్డి నీరజ దంపతులు సమర్పించారు. సాయంత్రం మహిళలతోతులసి పూజ నిర్వహించారు.

చిట్టమూరులో..

చిట్టమూరు : మండలంలోని మెట్టు, మల్లాం, చిట్టమూరు, గునపాడు గ్రామాల్లోని షిరిడీ సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. చిట్టమూరు, మల్లాంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామోత్సవం, రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు.

కోటలో..

కోట: మండల కేంద్రంతోపాటు విద్యానగర్, శ్యాంసుందరపురం, తిమ్మనాయుడుపాళెం సాయిబాబా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నదానం చేశారు. కోట తూర్పువీధిలోని సాయిబాబా మందిరంలో సాయి సత్యవ్రతం, పల్లకీ ఉత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

వాకాడు మండలంలో..

వాకాడు: స్థానిక ఆనంద సాయి నిలయంలో ద్రవ్యాభిషేకాలు, పుష్పాలంకారం, భక్తి గీతాలాపన, గ్రామంలో పల్లకీ సేవ, అన్నదానం నిర్వహించారు. రాత్రి క్యాండిల్స్‌తో పురవీధుల్లో సాయి నామస్మరణతో బాబాను ఊరేగించారు. అలాగే గంగన్నపాళెం, దుగ్గరాజపట్నం, కల్లూరు కొత్తపాళెం, నిడిగుర్తిలోనూ వేడుకలు నిర్వహించారు.

రాపూరులో..

రాపూరు: స్థానిక షిర్డి సాయి మందిరం ఉదయం కాగడ హారతి, అభిషేకం, ప్రత్యేక పూలంగి సేవ, సాయంత్రం భజన, రాత్రి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం దగర పాండురంగారెడ్డి తన తండ్రి స్మారకార్థం అన్నదానం చేశారు. అలాగే వెంకయ్యస్వామి ఆశ్రమంలో ఇవే వేడుకలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వెంకటగిరి రూరల్‌లో..

వెంకటగిరి రూరల్: పట్టణంలోని కుమ్మరిగుంట, పాత బస్టాండ్ సాయిబాబా దేవస్థానాలు, కాలేజీమిట్టలోని సాయిబాబా ఆశ్రమం, సుదర్శన్‌నగర్‌లోని సాయిబాబా ఆలయం, కలివేలమ్మతల్లి ఆలయం, బంగారుపేటలో, చాముండేశ్వరస్వామి, బ్రహ్మంగారిమఠం దేవస్థానాలతోపాటు జంగాలపల్లె, ముద్దంపల్లె, వల్లివేడు తదితరుల గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తులకు అన్న ప్రసాదాలు, కుమ్మరిగుంట సాయిబాబా ఆలయంలో పేద విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు.

వైభవంగా షిరిడీ సాయిబాబా నగరోత్సవం

నాయుడుపేటటౌన్: స్థానిక బ్రాహ్మణ వీధిలోని సాయిబాబా మందిరం వద్ద రాత్రి ప్రత్యేక రథంపై బాబా చిత్రపటాన్ని ఉంచి పురవీధుల్లో వైభవంగా నగరోత్సవం నిర్వహించారు. కేరళ మహిళలతో పంచవాయిద్యాలు, సాయి సంకీర్తన లు, పండరి భజనలు, మేళతాళాలు, బాణ సంచా మోత నడుమ ఈ కార్యక్రమం నిర్వహించారు. దాదాపు రూ.6 లక్షలతో 120 గ్రాముల బంగారంతో నేపాల్ రుద్రాక్షలతో తయారు చేసిన బంగారు హారాన్ని బాబాకు అలంకరించారు. అనంతరం మహిళలు సామూహిక సాయి సహస్ర నామ కుంకుమార్చన పూజలు చేశారు. మధ్యాహ్నం పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. రాత్రి ఆలయం వద్ద జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అలాగే, అగ్రహారపేట సాయిబాబా మందిరంలో పాలాభిషేకం చేశారు. బాబాకు వెండికిరీటం తొడిగారు. రాత్రి ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించారు.

కలువాయిలో..

కలువాయి(సైదాపురం): మండలంలోని కలువాయిలో శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో ఉదయం బాబాకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.



సైదాపురం: భజన చేస్తున్న భక్తులు



వెంకటగిరి రూరల్: అన్న ప్రసాదాలు పంపిణీ

గురువులకు సన్మానం



గురువులను సత్కరిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

తడ: తడకండ్రిగలోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. నిప్పో పరిశ్రమ సౌజన్యంతో అన్నదానం చేశారు. అలాగే మాంబట్టులోని అన్నపూర్ణ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలోకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ట్రస్ట్ భవనంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఫణివేణితోపాటు 8 మంది గురువులను సత్కరించారు. అన్నదానం చేశారు. స్విమ్స్ వైద్యులు కారణి మునుస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సూళ్లూరుపేట ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతికిరణ్ మాట్లాడారు. అన్నదాన ట్రస్ట్‌కు తుర్లపాటి బాలసరస్వతి స్మారకార్థం ఆమె కుమారుడు, కోడలు లక్ష రూపాయల డిపాజిట్ పత్రాన్ని నిర్వాహకులకు అందజేశారు.

నెల్లూరులోనూ రెడ్‌బుక్ రాజ్యాంగమే..!



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కిలివేటి సంజీవయ్య

- రాబోవు రోజుల్లో రెండింతలు మూల్యం చెల్లించక తప్పదు
- దాడులపై నియోజకవర్గ కన్వీనర్ కిలివేటి సంజీవయ్య హెచ్చరిక

సూళ్లూరుపేట: రాజకీయ కక్షలు లేకుండా స్నేహపూర్వక రాజకీయం నడుస్తున్న నెల్లూరు జిల్లాలో రెడ్‌బుక్ దాష్టీకం కొనసాగిస్తున్నారని, పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ ఇంటిపై రౌడీమూకలతో దాడులు చేయించడం మహిళలు చేసే పనేనా? అని సూళ్లూరుపేట నియోజకవర్గ కన్వీనర్ కిలివేటి సంజీవయ్య ప్రశ్నించారు. గురువారం సాయంత్రం ఆయన సూళ్లూరుపేటలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రసన్నకుమార్ రెడ్డిపై వ్యక్తిగతంగా ప్రస్తుత కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పదే పదే చౌకబారు విమర్శలు చేస్తుంటే ఆయన కూడా వ్యక్తిగతంగా విమర్శలు చేశారని, దీనిని ఓర్వలేక ఫ్యాక్షన్ కు మించిన దాడులు చేయించడం హేయమని నిరసించారు. దాడి చేసిన సమయంలో ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆయన కుమారుడు ఉన్నపక్షంలో వారిని హతమార్చేవారని, ఆయన తల్లిని సైతం దుర్భాషలాడటం శోచనీయమన్నారు. ఇద్దరు డీస్పీలు, ఎస్పీ, ఏఎస్పీ, సీఐలు, ఎస్సైలు జరిగిన సంఘటనను చూసి కూడా కేసు నమోదు చేయలేదంటే పోలీస్ వ్యవస్థ అధికార పార్టీకి ఎంతగా దాసోహమైందో తెలుస్తోందని, అదే ప్రసన్నకుమార్‌రెడ్డిపై ప్రశాంతిరెడ్డి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశారని మండిపడ్డారు. రాబోవు రోజుల్లో ఇంతకు రెండింతలు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మండలపార్టీ అధ్యక్షులు అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు వేళ్లపాళెం కృపాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్లు మీజూరు రామకృష్ణారెడ్డి, బందిల మహేశ్వర్, పార్టీ నాయకులు స్వామిరెడ్డి, అలవల సురేష్, అల్లూరు రమేష్‌రెడ్డి, తుపాకుల ప్రసాద్, అయితా శ్రీధర్, కాకి శ్రీరామ్మూర్తి, పర్వతరెడ్డి రవిరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా

పెళ్లకూరు: మండలంలోని తాగునీటి సమస్యలను పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, పలు ప్రాంతాల్లో పనిచేయని మోటార్లు, బోర్లను వాడకంలోకి తీసుకురావాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను జరగకుండా చూడాలన్నారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, మండల స్థాయి అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడం వల్ల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఐసీడీఎస్, విద్యాశాఖ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యుత్, ఉద్యానశాఖ అధికారులు కొంత కాలంగా అందుబాటులో లేరని మండిపడ్డారు. సమావేశంలో తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీఓ ప్రమీలారాణి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రాపూరు: మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ భవాని అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రజలను కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే పరిస్థితి ఉండరాదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులు మాట్లాడుతూ, జల్‌జీవన్ మిషన్ పథకం కింద సైదాదుపల్లె, వెలుగోను, ఏపూరు గ్రామాలకు మంచినీటి ట్యాంకులు మంజూరు చేశారని, ఒక్కో ట్యాంకు రూ.30లక్షలతో నిర్మించనున్నట్లు చెప్పారు. మండల కో–ఆప్షన్ సభ్యుడు సయీద్ మాట్లాడుతూ, ఆధార్ కేంద్రాన్ని మద్దెలమడుగులో కాకుండా రాపూరులో ఏర్పాటు చేస్తే మండల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటున్నారు. నెల్లూరుకు బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. ఎంపీపీ ప్రసన్న, జెడ్పీ ఉపాధ్యక్షురాలు ప్రసన్న, వైస్ ఎంపీపీ వెంకటస్వామి, తహసీల్దార్ నరసింహులు, ఏఓ సోమసుందర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా శ్రీకాంత్



ఓజిలి: ఎస్‌ఐగా కుర్రా శ్రీకాంత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ స్వప్నను శ్రీహరికోటకు, అక్కడ నుంచి శ్రీకాంత్ ఇక్కడికి బదిలీ అయ్యారు. మండలంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తానని ఆయన చెప్పారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా నాగరాజు



రాపూరు: రాపూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా నాగరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఈయన తిరుపతి జిల్లా డక్కిలి మండలంలో ఏఈఈగా పనిచేస్తు ఉద్యోగోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జి డీఈఈగా పనిచేస్తున్న మోహన్‌రావు తన యథాస్థానమైన ఆత్మకూరుకు వెళ్లారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

నాయుడుపేటటౌన్: పంచాయతీల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించాలని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీల పురోగతి సూచిక వెర్షన్ 2.0పై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, పలు శాఖల అధికారులకు ఇచ్చిన శిక్షణలో ఆమె మాట్లాడారు. ఎంపీడీఓ సురేష్‌బాబు, సూళ్లూరుపేట డివిజన్ డీఎల్‌పీఓ జాలిరెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

పంచాయతీల పురోగతి సూచికపై శిక్షణ

కోట: పంచాయితీల అభివృద్ధి ప్రణాళికపై రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాసరి అంజమ్మ ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులకు ఎంటీటీలు కిరణ్,లోహిత్ శిక్షణ ఇచ్చారు. పంచాయతీల ప్రస్తుత పరిస్థితి, మెరుగు పరిచేందుకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ వేణు, జెడ్పీటీసీ కోటయ్య పాల్గొన్నారు.

బాలాయపల్లెలో..

బాలాయపల్లె(సైదాపురం): మండల కేంద్రమైన బాలాయపల్లె వెలుగు కార్యాలయంలో ఎంపీడీఓ వినీల్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఐసీడీఎస్, ఏఎస్ఎం అధికారులతో పంచాయతీల పురోగతి సూచిక 2.0పై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్లుగా డిప్యూటీ ఎంపీడీఓ మోహన్‌రాజు, అశోక్, మౌలా వ్యవహరించారు.

చండీ హోమం

చిల్లకూరు: మండల తీర ప్రాంతమైన తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, చండీ హోమం చేశారు. ఉభయదారులు హంపీ ఫుడ్స్ అధినేత పీ.చక్రవర్తి, లక్ష్మి దంపతులు సారె సమర్పించారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

వెంకటగిరి రూరల్: పట్టణంలోని కుమ్మరిగుంట ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు స్థానిక 4వ వార్డు కౌన్సిలర్ ఎంఏ నారాయణ నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సర్వే

సైదాపురం: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రవీంద్రబాబు కోరారు. మండలంలోని కలిచేడు, లింగసముద్రంలో వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, పరిశుభ్రతపై ఎస్ఎస్‌జి బృందం సర్వే చేసింది. తడి, పొడి చెత్త, ఘన వ్యర్థాలను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సచివాలయాలు, పాఠశాలలు, వెల్‌నెస్ సెంటర్లు, పశువైద్యశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచులు వరప్రసాద్ రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల కొరత తీర్చండి సారూ!

- ఆత్మీయ సమావేశాల్లో విద్యార్థుల తల్లిదండ్రుల వినతి



దొరవారిసత్రం: మావిళ్లపాడు ఆదర్శ పాఠశాలలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

దొరవారిసత్రం: మండలంలో టీచర్ల సమస్యల ప్రస్తావనకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం వేదికగా మారింది. గురువారం అన్ని స్కూళ్లలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశం నిర్వహించిన ప్రతి స్కూలులోనూ టీచర్ల కొరత తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. మండలంలో మోడల్ ప్రైమరీ పాఠశాలలు 14, ఫౌండేషన్ పాఠశాలలు 42 గాను 108 మంది ఉపాధ్యాయులు ఉండాలి. కానీ ప్రస్తుతం 50 మంది మాత్రమే ఉండడం వలన పిల్లల చదువులు సక్రమంగా కొనసాగడం లేదని అక్కరపాక, వేణుంబాకం, నేలపట్టు జీసీ, తల్లంపాడు తదితర పాఠశాలల్లోని పిల్లల తల్లిదండ్రులు సమస్యలను ప్రస్తావించారు. మావిళ్లపాడు ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో నాయుడుపేట సీఐ సంఘమేశ్వరావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థుల చదువుల విషయంలో తల్లిదండ్రులు చొరవ తీసుకోవడంతో పాటు స్మార్ట్ ఫోన్లు ఇవ్వకుండా చూడాలన్నారు. ఎంఈఓ కృష్ణయ్య, ప్రిన్సిపాళ్లు సుమలత, పార్వతి, ఎస్ఐ అజయ్‌కుమార్, టీచర్లు పాల్గొన్నారు.

గంటల తరబడి ఎదురుచూపులు

వాకాడు: మండలంలో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమంపై విమర్శలొచ్చాయి. కూలి పనులపై ఆధారపడిన తమను పనులు కూడా మానుకుని మీటింగులకు రావాలని అధికారులు ఊదరగొట్టారని, తీరా స్కూళ్లకు వస్తే గంటల తరబడి కూటమి నాయకుల రాకకోసం ఎదురుచూపులు చూడాల్సి వచ్చిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు.

విద్యార్థులు తప్ప కానరాని తల్లిదండ్రులు

కలువాయి(సైదాపురం): కలువాయి బీవీఎస్‌ఆర్ జెడ్పీ హైస్కూల్‌లె నిర్వహించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో విద్యార్థులు తప్పితే తల్లిదండ్రులు కనపడలేదు. ఆ స్కూల్లో ప్రధానంగా టీచర్ల కొరత ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని హెచ్ఎం అబ్బాస్‌ఆలీని కోరారు.

తవ్వేయ్..దోచెయ్..!



ఓడూరులో అక్రమంగా చేస్తున్న గ్రావెల్ తవ్వకాలు

చిల్లకూరు: ప్రభుత్వ భూమి ఖాళీగా కనిపిస్తే చాలు అధికార పార్టీ నాయకులు భూ బకాసులవుతున్నారు! అక్కడ లభించే ఖనిజ సంపదను కొల్లగొట్టి జేబులు నింపుకుంటున్నారు. మండలంలోని ఓడూరులో ప్రభుత్వ (సీలింగ్‌కు వదలిన) భూమిలో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తుంటే చివరకు గ్రామస్తులే అడ్డుకున్నారు. తవ్వకం పనులు కూడా చేయనీకుండా నిలువరించారు. దీంతో గ్రావెల్ తరలింపుదారులు వారితో వాగ్యుద్ధం చేశారు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. వాస్తవానికి గతంలో గ్రామ శ్మశానాన్ని బాగు చేసుకునేందుకు సర్పంచ్ గ్రావెల్ తరలిస్తే వెంటనే అడ్డుకుని కేసులు నమోదు చేసిన అధికారులు ఇప్పుడు అధికార పార్టీకి చెందిన వారు ఇష్టారాజ్యంగా గ్రావెల్ తరలిస్తున్నా పట్టించుకోకపోవడం ఎంతవరకు సబబమని గ్రామస్తులు మండిపడ్డారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాసులను వివరణ కోరగా.. జొన్నా మస్తానయ్య, చెంగమ్మల పేరిట ఉన్న భూమిని చదును చేసుకోవాలని దరఖాస్తు చేసుకోగా అనుమతి ఇవ్వడంతో పాటు అందులో వచ్చిన మట్టి ,గ్రావెల్‌ను నాలుగు రోజుల పాటు తరలించుకునేందుకు అనుమతించినట్టు చెప్పారు.

ఆటస్థలం కేటాయించరూ!

–ఆర్డీఓకు విద్యార్థినుల వినతి



నాయుడుపేటటౌన్: మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్మయి

నాయుడుపేటటౌన్: తమకు ఆటలంటే ఇష్టమని, అయితే తమకు స్కూలుకు గ్రౌండ్ లేదని, స్కూ లు సమీపంలో తమకు ఆటస్థలం కేటాయించాలని స్థానిక పీఎంశ్రీ జెడ్పీ బాలికల హైస్కూలు విద్యార్థినులు సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయిని కోరారు. గురువారం ఇక్కడ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్డీఓ హాజరై మాట్లాడారు. విద్యార్థినులకు వివిధ పండ్ల మొక్కలు పంపిణీ చేసి, వాటిని ఇళ్ల వద్ద నాటి, సంరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సమస్యలను ఆర్డీఓకు నివేదించారు. తహసీల్దార్ మాగర్ల రాజేంద్ర, ఎంఈఓ మునిరత్నం, హెచ్ఎం మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇక, మండలవ్యాప్తంగా నిర్వహించిన సమావేశాల్లో విద్యార్థులకు 8,800 వివిధ రకాల మొక్కలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ చెప్పారు.

ఫ్చ్..! అంతంత మాత్రమే..

చిల్లకూరు: తీర ప్రాంతంలోని ఏరూరులో మెగా పేరెంట్స్ మీటింగ్ అంతంతమాత్రంగానే నిర్వహించారు. ఇక్కడి ప్రాథమికోన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు 1 నుంచి 5 వరకు విద్యార్థులు కిలోమీటరు దూరంలోని అల్లీపురం స్కూల్‌లో విలీనం చేశారు. దీంతో స్కూలుకు నెల రోజులుగా ఒక్క విద్యార్థి కూడా రావడం లేదు. ఇక లాభం లేదని టీచర్లే గ్రామంలోకి వెళ్లి తల్లిదండ్రులకు బతిమాలాడారు. ఆ వచ్చిన వారితో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించి మమ అనిపించారు! ఇదలా ఉంచితే, పారిచెర్లవారిపాళెం జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన ఇదే కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి హాజరై, అక్కడ వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు ఇచ్చారు. పలు స్కూళ్లలో మొక్కుబడిగా ఈ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మన్నెం శీనయ్య, ఎంఈఓ రఫూప్, సర్పంచ్ అరుణమ్మ, హెచ్ఎం అనసూయమ్మ, సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ సురేష్‌బాబు చైర్‌పర్సన్ షకీలా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ఓజిలి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీఓ విజయలక్ష్మి కోరారు. మండలంలోని కురుగొండ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సర్పంచ్ శ్రీలక్ష్మి, ఎంఈఓ చంద్రశేఖర్, హెచ్ఎం వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు, టీచర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య ముఖ్యం



మ్యూజికల్ చైర్స్ పోటీలో విద్యార్థుల తల్లులు

సైదాపురం: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందివ్వాలని సర్పంచ్ శారద కోరారు. స్థానిక ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం ఎంఈఓ సుప్రియ మాట్లాడారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గూడూరు : 90108 97733, 99122 20591
వెంకటగిరి : 99122 20591
సూళ్లూరుపేట : 90102 23710